# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

## చలో విజయవాడ





















# చలో
# విజయవాడ
# కార్యక్రమ
# దృశాలు



# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 15 ఫిబ్రవరి-మార్చి 2026 సంచిక: 2**


## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| జర్నలిస్టుల గృహవసతి కల్పనకు ప్రాధాన్యం ......... | 5 |
| చలో విజయవాడ చారిత్రాత్మక ఘట్టం ............. | 9 |
| ఫెడరేషన్ మహాసభలకు ఆహ్వానం ................ | 11 |
| ప్రజాప్రతినిధి నోట జర్నలిస్టు మాట ........................ | 13 |
| విశాఖలో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన ............ | 15 |
| సార్వత్రిక సమ్మెలో జర్నలిస్టులు .......................... | 17 |
| జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ కృషి ...................... | 19 |
| జర్నలిస్టుల సంక్షేమానికి కృషి .................... | 21 |
| ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు ---------------- | 23 |
| కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు ................. | 24 |
| డెక్కన్ క్రానికల్ ఎంప్లాయీస్ విజయం ....... | 27 |
| అనకాపల్లి ఎపిబిజెఎ కార్యవర్గం ...... | 29 |



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

జి.ఆంజనేయులు
ఎస్.వెంకట్రావు
వి.నవీన్‌రాజ్
ఎమ్. శ్రీనివాస్
బి.ఎన్.ప్రసాదరావు
వి.గోపి
వి.రామారావు
ఆర్.రామాంజనేయులు
బి. ఈశ్వరరావు
కె.వేణుగోపాలరావు
టి.మద్దులేటి
వి.భక్తవత్సలం
ఒ.శాంతి
ఎస్.మురళీశంకర్
కె.ఎస్.శంకరరావు
జి. శీనుబాబు
డి.మధుసూదనరావు

డిజైనర్:

PUBLISHED, PRINTED AND EDITED BY
G. Anjaneyulu on behalf of
Andhra Pradesh Working
Journalists Federation
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi
Sapphire, Golconda 'X' Roads,
Musheerabad, Hyderabad-500 020, A.P.

PRINTED AT
Prajashakthi, M.B. Bhavan, Near RTC Cross
Roads, Hyderabad-500 020.

EDITOR
A.Amaraiah
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


# చలో విజయవాడకు మంచి స్పందన!

విజయవాడ వీధుల్లో మార్చి 4న జర్నలిస్టుల సమస్యల నినాదాలు మారుమోగాయి. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై జర్నలిస్టులు పెద్దఎత్తున స్పందించి వీధుల్లోకి వచ్చారు. ఉద్యోగ భద్రత ఎండమావిగా మారింది. బతుకు సమరం అడుగు సాగనంటోంది. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వ్యవహరించే జర్నలిస్టు రక్షణకు దారులు వెతుక్కునే స్థితికి వెళ్లిపోయాడు. వృత్తి విలువలు అడుగంటాయి. కనీస రక్షణ కరవయింది. అన్యధా శరణం నాస్తి అన్న రీతిలో ప్రభుత్వం మినహా మరెవరూ తనను కాపాడలేరనే స్థితికి చేరుకున్నాడు. ఇప్పటికే ఆరోగ్యబీమా సదుపాయం ప్రభుత్వం ఇస్తోంది. ఆర్టీసి బస్సుల్లో రాయితీపై ప్రయాణానికి అవకాశం కల్పించింది. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణకు ఉన్న చట్టాలను రద్దు చేయడంతో ఈ వృత్తిలో తన స్థానమేమిటో తెలియని అయోమయ స్థితి నెలకొంది. చేసిన, చేస్తున్న పనికి వేతనం ఇవ్వాల్సిన యజమాని ఎదురుజీతం అందుకునే స్థితిలో ఉన్నాడు. మీడియా ప్రపంచం వ్యాపారమయం అయిపోయింది. విస్తృత ప్రజాప్రయోజనం అనే మాట బూతుగా మారిపోయింది. ఇంతకంటే అధ్వాన్నమైన పరిస్థితులున్నాయని భావించే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మొదటి ప్రెస్ కమిషన్‌ను నియమించి కేంద్రం వాస్తవ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేసింది. ఫలితంగానే జర్నలిస్టు చట్టాలు రూపుదిద్దుకున్నాయి. నిర్దిష్టమైన వేతన వ్యవస్థ ఏర్పడింది. ఆచరణలో అన్నీ అమలుకు నోచుకోకపోయినప్పటికీ సూటిగా సాగిపోయేందుకు ఒక దారి ఏర్పడింది. జర్నలిస్టు చట్టాల రద్దుతో ఆ దారి పూర్తిగా మూసుకుపోయింది. వ్యవస్థలో చోటు చేసుకున్న సరికొత్త మార్పులతో వృత్తి కొత్త పుంతులు తొక్కుతోంది. గతం కంటే అధ్వాన్నమైన పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో సరికొత్త ఆలోచనలు చేయాల్సిన తరుణమిది. ఏ రాష్ట్రానికా రాష్ట్రం తమ పరిధిలోని మీడియా స్థితిగతులను, దానిపై ఆధారపడి జీవనం కొనసాగించేవారి పరిస్థితులను తెలుసుకుని వారి జీవిక సజావుగా సాగిపోయేందుకు అనువైన దారి వెతికేందుకు ప్రభుత్వాలు యోచించాల్సిన సమయమిది. జర్నలిస్టు విలువలు బతికి బట్ట కట్టేందుకు, ఈ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నవారికి కాపాడుకునేందుకు ప్రయత్నించేందుకు నడుం బిగించాల్సింది ప్రభుత్వాలే. వారి ఆలోచనలను ప్రభావితం చేసేందుకు చేసిన చిన్న ప్రయత్నమే మార్చి 4న జర్నలిస్టులు విజయవాడలో నిర్వహించిన ప్రదర్శన, సభ. ఆ ప్రధాన లక్ష్యం ఎంతమేరకు నెరవేరుతుందనేది వేచి చూడాల్సిందే. తక్షణ స్పందనగా జర్నలిస్టుల కనీస సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని సమాచార శాఖ మంత్రి మాటలను బట్టి తెలుస్తోంది. వాటి ఆచరణ రూపం ఏమిటో త్వరలో తెలుస్తుంది.




# జర్నలిస్టుల గృహవసతి కల్పనకు ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్‌లోని జర్నలిస్టులు ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎల సంయుక్త సారథ్యంలో మార్చి 4వ తేదీన చలో విజయవాడ కార్యక్రమంతో కదం తొక్కుతూ విజయవాడ వీధుల్లో తమ సమస్యల గళం ఎలుగెత్తి వినిపించారు.

## జర్నలిస్టు సంక్షేమనిధికి మంత్రి పార్థసారథి విరాళం ఐదు లక్షలు

## జర్నలిస్టులను నిర్లక్ష్యం చెయ్యం: మంత్రి పార్థసారథి

## పరిశీలనలో ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత విద్య

## పేదలతో పాటు స్థలాల కేటాయింపు అవకాశం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర సమాచార గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా జర్నలిస్టులకు గృహవసతి కల్పించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని అన్నారు. గృహవసతిలేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం ఇచ్చే విషయమై యోచన చేస్తున్నదని ఆ పరిధిలోకి జర్నలిస్టులను తీసుకువచ్చేందుకు గల సాధ్యాసాధ్యాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆ శాఖ మంత్రిగా నిధుల సమీకరణకు గల అవకాశాలను అన్వేషిస్తున్నామని, విరాళాల ద్వారా, యాజమాన్యాల నుంచి, ఇతర పద్ధతులను కూడా చూస్తున్నామన్నారు. ఆ శాఖ మంత్రిగా జర్నలిస్టుల సంక్షేమ నిధికి తన వంతుగా వ్యక్తిగతంగా ఐదు లక్షల రూపాయలు అందజేస్తానని ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 4వ తేదీ విజయవాడలో నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమ ముగింపు సభలో ఆయన పాల్గొని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా జర్నలిస్టు నాయకులు ప్రస్తావించిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు.



సామాజిక భద్రత ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, వివిధ రకాల పెన్షన్ల కోసమే




ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను వ్యయం చేస్తున్నదని, జర్నలిస్టుల పెన్షన్‌కు గల అవకాశాలను పరిశీలిస్తామని ఆయన చెప్పారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకం ఎలాంటి ఆటంకం లేకుండా నిరవధికంగా కొనసాగేలా చూస్తానన్నారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఏడాదికి రెండుసార్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలన్న విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ ఐఎంఏ, పెద్ద ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించి ఈ సమస్య పరిష్కారమయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు. జర్నలిస్టుల పట్ల తమ ప్రభుత్వానికి సానుకూలతే ఉందని.. వివిధ సందర్భాల్లో జిల్లాల్లో జర్నలిస్టు సంఘాల నాయకులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను చర్చించి పరిష్కరిస్తుంటామన్నారు. కొన్ని ముఖ్యమైన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తుంటామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె. పార్థసారథి వివరించారు. సోషల్ మీడియా రంగ ప్రవేశంలో మీడియాలో మార్పు వచ్చిందని, అంతమాత్రాన ప్రధాన మీడియాను పట్టించుకోక పోవడమంటూ ఉండదని ఎవరి ప్రాధాన్యం వారికుంటుందన్నారు. మీడియా తమ చేతల్లో ఉన్నదని అవాస్తవాలు, అబద్ధాలు రాయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. జర్నలిస్టులపై జరిగే దాడుల్ని ఖండించి తీరతామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థల్లో ఉచితంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యా సదుపాయం కల్పించే విషయం పరిశీలిస్తామన్నారు.







అసెంబ్లీలో ప్రతిపక్షం లేకున్నా మీడియాలో వస్తున్న వివిధ సమస్యలను ప్రభుత్వం చర్చిస్తున్నదని మంత్రి తెలిపారు. సోషల్ మీడియా, యూట్యూబ్ లలో తరచూ ఫేక్ న్యూస్ వస్తున్నందున మిగతా జర్నలిస్టుల మీద కూడా కొంత విముఖత లేకపోలేదన్నారు. అబద్ధాల.. తప్పుడు వార్తల విషయంలో ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. దేశంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల కంటే ప్రజల సంక్షేమానికి ఎక్కువ మొత్తంలో కేటాయిస్తోంది ఆంధ్రప్రదేశ్ అని ఆయన చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలివచ్చి తమ సమస్యలను చెప్పడం ప్రభుత్వ బాధ్యతను మరింతగా పెంచడమే అవుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన “చలో విజయవాడ” కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచీ చాలా పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. జర్నలిస్టుల ప్రదర్శన మహాత్మాగాంధీ రోడ్డు రాఘవయ్య పార్క్ సెంటర్ నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు జర్నలిస్టుల సమస్యల నినాదాలతో మారుమోగుతూ సాగింది.

కళాక్షేత్రంలోకి విచ్చేసిన ప్రదర్శకులకు ఎన్టీఆర్ జిల్లా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వాగతం పలికారు. అనుకున్న సమయం కంటే ముందుగానే విచ్చేసిన సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథికి ఫెడరేషన్ నాయకులు స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సభకు ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కె.కలిమిశ్రీ, కార్యదర్శి ఎం.బి.నాథన్‌లు మంత్రి పార్ధసారధిని సభ పైకి తోడ్కొని వస్తూ మొక్క అందజేశారు. వేదికపై ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీస్‌బేరర్లు, మొత్తం కార్యవర్గం, జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఆసీనులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నాయకులు వై.దయానంద్ తోడ్పాటుతో కళాక్షేత్రంలో భాగవతుల సౌమ్య శిష్యబృందం నాట్య కార్యక్రమంతో సభ ఆరంభమైంది. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారుల గీతాలాపనతో సభ మరింత శోభను సంతరించుకుంది. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన జర్నలిస్టులు



తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను మంత్రి పార్థసారథికి అందజేశారు.

సభాధ్యక్షులు వెంకట్రావు జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ప్రధానకార్యదర్శి జి.ఆంజనేయులు వివిధ సమస్యలను సోదాహరణంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. ఆయా సమస్యలపై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి యధాశక్తి కృషి చేస్తానని పేర్కొన్నారు. జర్నలిస్టుల ముఖ్య సమస్యలన్నింటినీ సీఎంతో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ''జర్నలిస్టులను విస్మరించం.. నిర్లక్ష్యం చేయం" అని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ నిధిని పెంచి ఫలాలు అందేలా కార్యాచరణ చేస్తామని మంత్రి పార్థసారథి తెలియజేశారు. ఈ సంక్షేమనిధికి తాను వ్యక్తిగతంగా ఐదు లక్షల రూపాయలు అందజేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాల అభ్యర్థనను ప్రస్తావిస్తూ గృహవసతి కోసం




ప్రజలకు అమలవుతున్న పథకంలో జర్నలిస్టుల్ని కలిపే విషయం సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. "ఫెడరేషన్" ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ "సేవ్ జర్నలిజం.. ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్" అని నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు పేర్కొన్న అంశాన్ని తొలుత ప్రస్తావించారు. తమ సంఘంలో 7 వేల మందికి పైగా సభ్యులున్నారంటూ సంఘానికున్న బలాన్ని వివరించారు. జర్నలిజం వృత్తి పెద్ద ప్రమాదంలో పడింది. జర్నలిస్టులకున్న రెండు చట్టాలను కేంద్రం రద్దు చేసింది. ఈ పరిస్థితుల్లో జర్నలిస్టులను ఆదుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. అందుకు అనుగుణంగా జర్నలిస్టుల స్థితిగతులను అన్నింటినీ అధ్యయనం




చేసేందుకు, మారిన కాలమాన పరిస్థితుల్లో మీడియా స్వరూప స్వభావాలను అధ్యయనం చేసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది అని ఆంజనేయులు పేర్కొన్నారు. కొన్ని వార్తలు విషయంలో అప్పుడప్పుడు రాజకీయ నాయకులు మరికొన్ని సంఘ వ్యతిరేక శక్తుల నుండి దాడులు ఎదుర్కొన్న సందర్భాలు గతంలో ఉంటే ఇప్పుడు అధికారుల నుండే జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయి. కేసులు పెడుతున్నారు. నోటీసులు ఇస్తున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు మూడేళ్లపాటు జర్నలిస్టు సంక్షేమ నిధి నుంచి నెలకు వెయ్యి రూపాయలు ఇచ్చే ఏర్పాటు ఉండేదని, ఆ మొత్తాన్ని మూడు వేలకు, ఐదువేలకు పెంచే ప్రతిపాదన చర్చకు వచ్చినా చాలాయేళ్ళుగా ఆ వెయ్యి రూపాయలు కూడా ఇస్తున్న పరిస్థితులు లేవని అన్నారు. సంక్షేమనిధికి ప్రభుత్వం యాభై కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో కనీసం ఒక్క వృద్ధాశ్రమాన్ని జర్నలిస్టుల కోసం నిర్వహించాలని ఆంజనేయులు అభ్యర్థించారు. దేశంలో 18 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పెన్షన్ ఇస్తున్నారు. రాష్ట్రంలో 1200 మంది లోపే పెన్షన్ అర్హత గల జర్నలిస్టులుంటారు. జర్నలిస్టుల సామాజిక భద్రతను దృష్టిలో పెట్టుకుని పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు.

మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ సందర్భాలలో జర్నలిస్టుల సమస్యలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వాధినేతలకు వినతిపత్రాలు ఇచ్చామని అంటూ ఈ ప్రదర్శన ద్వారా రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్టు అధ్యక్షోపన్యాసంలో వెంకట్రావు ప్రస్తావించారు. వేదిక నలంకరించిన వారిలో నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య, కోశాధికారి ఎ.అమరయ్య, జండర్ ఈక్విటీ కౌన్సిల్ కో చైర్‌పర్సన్ కె.మంజరి, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ కన్వీనర్ వీసం శ్రీనివాసరావు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులున్నారు. తొలుత ''కళారత్న'' నాట్యగురు భాగవతుల సౌమ్య శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి. సౌమ్యను మంత్రి శాలువాతో సత్కరించారు. నర్తకీమణులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రజానాట్యమండలి గాయకులు అనిల్, కవి, అప్పన్న పాడిన అభ్యుదయ గీతాలు అలరించాయి.

అద్భుత ప్రదర్శన

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నుండి పెద్ద సంఖ్యలో "ఛలో విజయవాడ" కార్యక్రమానికి విచ్చేశారు. కొన్ని జిల్లాల నుండి ముందురోజు రాత్రే నగరానికి చేరుకున్నారు. బస్సులు, రైళ్లు, కార్లు తదితర మార్గాల ద్వారా ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 11 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు ప్రకటించినా పది గంటలకే ప్రదర్శన ప్రారంభమయ్యి రాఘవయ్య పార్క్ వద్దకు చేరుకోనారంభించారు. 11:30 గంటల వరకు ఆయా జిల్లాల నుండి జర్నలిస్టులు వస్తూనే ఉన్నారు. మహిళా జర్నలిస్టులు కూడా చాలామంది హాజరయ్యారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి.. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి.. పెన్షన్ సదుపాయం కల్పించాలి.. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి.. జర్నలిస్టులకు వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి.. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి తదితర నినాదాలతో మహాత్మా గాంధీ రోడ్డు మారుమోగింది. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ రద్దీని అదుపుచేయడానికి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి అనివార్యంగా రోప్ పార్టీని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇటీవల కాలంలో ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ప్రదర్శన చేయడం చెప్పుకోదగ్గ విషయంగా పలువురు ప్రస్తావించారు.



# చలో విజయవాడ చారిత్రాత్మక ఘట్టం



**పోటెత్తిన సంద్రం నుంచి ఎగసిపడే అలలు అలలుగా కదిలి వచ్చిన వేలాది మంది జర్నలిస్టులు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సముద్రమంత సంస్థ అని రుజువుచేశారు. దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లపై అసంతృప్తితో రగిలిపోతున్న జర్నలిస్టులను చలో విజయవాడ కార్యక్రమం కదనరంగం వైపు అడుగులు వేయించింది.**
**ఉండేందుకు గూడు, పిల్లల చదువుకు అసరా, మూలనపడితే త్వరగా కోలుకునేందుకు భరోసా, వృద్ధాప్యంలో అలమటించే అవసరం లేని ఆదరణ కోసం సాగించిన ఈ ఉద్యమం ఊరూ వాడా ఏకం చేసింది. మారుమూల మండల కేంద్రం నుంచి మహానగరంలో పనిచేసే కలం కార్మికుని భుజం, భుజం కలిపి నడిచేందుకు ఉసిగొల్పింది.**

మార్చి 4వతేదీన జరిగిన చలో విజయవాడ కార్యక్రమం జర్నలిస్టుల చరిత్రలోనే కొత్త అధ్యాయానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నాంది పలికింది.

"ఒక్క సిరా చుక్క. లక్ష మెదళ్లకు కదలిక" అనేది ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు గారు చెప్పినట్టుగా ఎపిడబ్ల్యుజేఎఫ్ ఇచ్చిన ఒకే ఒక్క పిలుపు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరిని చైతన్య వరిచింది. ఆ స్ఫూర్తితో వేలాది మంది జర్నలిస్టులు తమ డిమాండ్ల సాధనకై కృష్ణాతీరం వైపు అడుగులు వేయడం ఒక చారిత్రాత్మక ఘట్టం.

ఉద్యమాలకు పుట్టినిల్లైన విజయవాడ నగరంలో జర్నలిస్టుల పక్షాన ఇటీవలకాలంలో ఇంత భారీ స్థాయిలో కార్యక్రమాలు జరుగలేదనే చెప్పాలి. కాని మార్చి 4 వతేదీ చలో విజయవాడ కార్యక్రమం అటు ప్రభుత్వంలో కూడా ఒక కదలికను తీసుకువచ్చింది. అన్ని జిల్లాల్లో తమదైన శైలిలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలపై పాటలు కట్టి పాడడం మొదలు సభలు, సమావేశాలు నిర్వహించారు. గోడపత్రికలు, పోస్టర్లు, కరపత్రాలు ప్రచారాస్త్రాలుగా సంధించారు. జిల్లాకొక రీతిలో రూపొందించిన పోసర్ల ప్రచారం జర్నలిస్టులతో పాటు ఇతర వర్గాల ప్రజల్లోకి కూడా వెళ్ళింది.

అటు శ్రీకాకుళం నుంచి మొదలు ఇటు చిత్తూరు జిల్లా వరకు ఉన్న జర్నలిస్టులు నెలరోజులు ముందు నుంచే తమ తమ జిల్లాల్లోని మండలాల్లో పర్యటించి గోడ పత్రికలను ఆవిష్కరించడంతో పాటు సమావేశాలను నిర్వహించడం ద్వారా జర్నలిస్టులను సమాయత్తం చేయడం కూడ చలో విజయవాడ విజయవంతంకావడానికి ఒక కారణంగా చెప్పాలి.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి.. జర్నలిస్టుల పిల్లలకు ఉచితవిద్య, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి... మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి.. పెన్షన్ సదుపాయం కల్పించాలి.. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి. జర్నలిస్టులకు వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి.. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి తదితర నినాదాలతో మహాత్మా గాంధీ రోడ్డు మారుమోగింది. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ రద్దీని అదుపుచేయడానికి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి అనివార్యంగా రోప్ పార్టీని ఏర్పాటు చేయాల్సొచ్చింది. ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ర్యాలీ చేయడం ఇటీవల కాలంలో ఇదే పేర్కొనదగినది.

**ప్రభుత్వ స్పందన**

జర్నలిస్టుల ప్రదర్శనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అందుకు నిదర్శనం సమావేశానికి చెప్పిన సమయం కంటే ముందుగానే సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విచ్చేశారు. జర్నలిస్టు నాయకులు ప్రస్తావించిన సమస్యలన్నింటిపై సానుకూలంగా స్పందించారు. "జర్నలిస్టులను విస్మరించం.. నిర్లక్ష్యం చేయం" అని స్పష్టం చేశారు. అన్నింటినీ మించి జర్నలిస్టుల ప్రదర్శన ఆనవాళ్ళు మదిలో నుంచి తొలగిపోకముందే మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను మీడియాకు తెలియజేసిన అనంతరం మంత్రి త్వరలో తీపి కబురు చెబుతామన్నారు. ముఖ్యమంత్రి జర్నలిస్టుల ప్రస్తావించిన అన్ని అంశాలపై స్పందించారని చెప్పారు.

**అద్భుత ప్రదర్శన**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నుండి పెద్ద సంఖ్యలో "చలో విజయవాడ" కార్యక్రమానికి విచ్చేశారు. కొన్ని జిల్లాల నుండి వేకువజామునే నగరానికి చేరుకున్నారు. బస్సులు, రైళ్లు, కార్లు తదితర మార్గాల ద్వారా ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 11 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని ప్రకటించినా పది గంటలకే చేరుకున్నారంటనే ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా తమ వంతు కర్తవ్యం నిర్వర్తించాలనే తపన వారిలో ఏ స్థాయిలో గూడుకట్టుకుని ఉందో తేటతెల్లమవుతున్నది. 11:30 గంటల వరకు ఆయా జిల్లాల నుండి జర్నలిస్టులు వస్తూనే ఉన్నారు. ప్రదర్శన ఆరంభమై తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రం చేరుకున్న అనంతరం కూడా వందల సంఖ్యలో జర్నలిస్టులు రావడాన్ని బట్టి జర్నలిస్టుల సమస్య తీవ్రత ఎంతగా ఉన్నదో స్పష్టమవుతోంది.






# ఫెడరేషన్ మహాసభలకు ఆహ్వానం

విశాఖపట్నంలో త్వరలో నిర్వహించబోయే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను ప్రారంభించి ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సుముఖత వ్యక్తం చేశారు. కుప్పంలో ఫిబ్రవరి 1వ తేదీ ఫెడరేషన్ ప్రతినిధివర్గం కలిసి ఆహ్వానించింది. ఆ సందర్భంగా చిత్తూరు జిల్లా ఫెడరేషన్ నాయకులు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫెడరేషన్ మీడియా డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులుతో పాటుగా రాష్ట్ర నాయకులు జయరాజ్, కడప జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్ రాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు బి ప్రకాష్, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షులు చల్లా జయచంద్ర, ఇతర నాయకులు మంజునాథ్, మహేష్. ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐరాస జర్నలిస్టు ఆల్బనేస్‌కు మద్దతు

ఆక్రమిత పాలస్తీనా ప్రాంతంలో ఐక్యరాజ్యసమితి పాత్రికేయురాలిగా పనిచేస్తున్న ఫ్రాన్సిస్ ఆల్బనేస్‌కు వంద మందికి పైగా ప్రముఖ కళాకారులు మద్దతు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు నుంచి వైదొలగాల్సిందిగా పలు ప్రపంచ దేశాలు ఆల్బనేస్‌పై ఒత్తిడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆర్టిస్ట్ ఫర్ పాలస్తీనా గ్రూప్' పేరిట రాసిన లేఖపై కళాకారులు సంతకాలు చేశారు. మానవ హక్కులు ముఖ్యంగా జీవించే హక్కు కోసం పాలస్తీనా ప్రజలు చేస్తున్న ఆందోళనకు బాసటగా నిలిచిన ఆల్బనేస్‌కు వారంతా పూర్తి మద్దతు తెలిపారు. బలప్రయోగం చట్టంగా ఉండకూడదు అని కోరుకునేవారు ఈ భూమిపై ప్రతి మూలలో ఉన్నారు. చట్టం అనే పదానికి నిజమైన అర్థం ఏమిటో ఎవరికి తెలుసు అని ఆ లేఖలో వారు ప్రశ్నించారు. లేఖపై సంతకాలు చేసిన వారిలో నటులు జేవియర్ బాటిల్, నోబెల్ బహుమతి గ్రహీత రచయిత అన్నే ఎర్నాడ్, బ్రిటన్‌కు చెందిన సంగీత కళాకారులు అనే లెనాక్స్ తదితర ప్రముఖులు ఉన్నారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను తీవ్రంగా విమర్శిస్తున్న వారిలో ఆల్బనేస్ ఒకరు. మానవాళికి ఉమ్మడి శత్రువు ఉన్నారంటూ ఆమె గతవారం అల్ జజీరా వేదికపై వ్యాఖ్యానించారు. పాలస్తీనాలో మారణ హోమానికి కారణమైన వ్యవస్థను ఉమ్మడి శత్రువుగా అభివర్ణించానని ఆమె ఆ తర్వాత వివరణ ఇచ్చారు. ఫ్రాన్స్, జర్మనీ సహా పలు యూరోపియన్ దేశాలు ఆల్బనేస్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతూనే ఉన్నాయి. అనేక పశ్చిమ దేశాలు ఆమెను లక్ష్యంగా చేసుకొని విమర్శలు సంధిస్తున్నాయి. ఇజ్రాయెల్‌ను విమర్శించడాన్ని అవి జీర్ణించుకోలేకపోతున్నాయి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని విమర్శించే వారిని నేరస్తులుగా చూస్తున్నారని ఇదే సమయంలో మారణ హోమానికి కుట్రలు పన్నిన వారిని వదిలేస్తున్నారని సినీ నిర్మాత రచయిత ఫ్రాంక్ భరత్ విమర్శించారు. అంతర్జాతీయ చట్టం ప్రకారం మారణ హోమాలను నివారించాల్సిన బాధ్యత ఆయా దేశాలపై ఉంటుందని కానీ గత రెండు సంవత్సరాలుగా అవి తమ కర్తవ్యాన్ని నెరవేర్చడంలో విఫలమవుతున్నాయని ఆల్బనేస్ ఆరోపిస్తున్నారు. ఆల్బనేస్‌పై యూరోపియన్ దేశాలు కన్నెర్ర చేయడంపై తమ సహచరులు ఆందోళన చెందుతున్నారని మానవ హక్కులకు సంబంధించిన ఐరాస హై కమిషనర్ కార్యాలయ ప్రతినిధి చెప్పారు.



అనంతపురం జిల్లా కలెక్టర్‌కు ఫెడరేషన్ ప్రచురించిన మీడియా డైరీని అందజేస్తున్న జిల్లా నాయకులు



విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫెడరేషన్ ప్రచురించిన మీడియా డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్



అనంతపురం జిల్లా కలెక్టర్‌కు ఫెడరేషన్ ప్రచురించిన మీడియా డైరీని అందజేస్తున్న జిల్లా నాయకులు



కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఫెడరేషన్ ప్రచురించిన మీడియా డైరీని అందజేస్తున్న జిల్లా నాయకులు

# ప్రజాప్రతినిధి నోట జర్నలిస్టు మాట



ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రజా ప్రతినిధి నోట జర్నలిస్టుల సమస్యల ప్రస్తావన వచ్చింది. బడ్జెట్‌పై మాట్లాడుతూ పూతలపట్టు శాసనసభ్యులు కె.మురళీమోహన్ సమాచార శాఖను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి ప్రస్తావించారు. బడ్జెట్లో సముచితమైన స్థానం ఇచ్చి పౌర సంబంధాల శాఖను బలోపేతం చేయడం సమంజసంగా ఉందని అది తప్పనిసరి అవసరమని అన్నారు. ఇదే సందర్భంలో ఆయన జర్నలిస్టులు ప్రధానంగా భావిస్తున్న ఇంటిస్థలాల సమస్య గురించి ప్రస్తావించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంచి ఆలోచన చేసి జర్నలిస్టులకు మేలు చేకూర్చాలని తన ఆలోచనలను సభలో పంచుకున్నారు. అంతేకాక మరో సూచనగా జర్నలిస్టుల పెన్షన్ విషయమై ఆలోచన చేయడం వారి సామాజిక భద్రతకు బాట వేసినట్లవుతుందన్నారు. దక్షిణ భారతదేశంలో కేరళ, కర్ణాటక తమిళనాడు ఉత్తర భారత దేశంలో జమ్మూ హర్యానా రాష్ట్రాల్లో పెన్షన్ విధానం అమల్లో ఉందని ఆంధ్రప్రదేశ్‌లో కూడా జర్నలిస్టులకు పెన్షన్ ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి యోచన చేస్తే బాగుంటుందని సూచించారు. ఎంతైనా పూతలపట్టు శాసనసభ్యులు పూర్వాశ్రమంలో జర్నలిస్టుగా పనిచేశారు కనుక తన బాధ్యతగా ఇది ప్రస్తావించారని జర్నలిస్టు వర్గాలు భావిస్తున్నాయి. ఈ సమాచారం తెలిసిన వెంటనే చిత్తూరు జిల్లా ఫెడరేషన్ నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. గత శాసనసభ సమావేశాల్లో గన్నవరం శాసనసభ్యులు యడ్లపాటి వెంకట్రావు జర్నలిస్టులకు కేటాయించిన నున్న హౌసింగ్ సొసైటీ విషయం ప్రస్తావించగా ఇప్పుడు మురళీమోహనరావు జర్నలిస్టుల పెన్షన్, గృహవసతి సమస్యపై మాట్లాడారు.






**విజయవాడలో మార్చి 4న జరిగిన చలో విజయవాడ ప్రదర్శన, అనంతరం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళావేదికలో జర్నలిస్టులపై గీతాలాపన చేసిన ప్రజానాట్యమండలి గాయకులు**

# కాకినాడలో 489 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

కాకినాడ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ రెండవ విడత సమావేశం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 2026–2027 ద్వైవార్షిక కాలానికి అక్రిడిటేషన్లు కోరుతూ, మీడియా సంస్థలు, వారి ప్రతినిధుల నుండి అందిన 311 ధరఖాస్తులను మీడియా అక్రిడిటేషన్ నిబంధనలు ప్రకారం కమిటీ పరిశీలన చేసి అర్హులైన 252 మందికి అక్రిడిటేషన్ల జారీకి ఆమోదించింది. అర్హతలు సమర్పించలేక పోయిన 59 ధరఖాస్తులను డిఫర్ చేసింది. గత నెల 29వ తేదీన జరిగిన కమిటీ తొలి సమావేశంలో 237 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయగా, రెండవ సమావేశంలో కమిటీ మరో 252 మందికి అక్రిడిటేషన్లు ఆమోదించిందని జిల్లా కలెక్టర్ సమావేశానంతరం వెల్లడించారు. అక్రిడిటేషన్లు ఆమోదించిన జర్నలిస్టులు అందరికీ త్వరలోనే అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను జిల్లాలో అర్హులైన వారందరికీ సమగ్రంగా అందేలా చర్యలు గైకొంటున్నామని, సమాజాభివృద్ధి, జిల్లా ప్రగతి కొరకు జర్నలిస్టులు తమ వంతు భూమికను నిబద్దతో చైతన్యవంతంగా నిర్వహించాలని కోరారు. జిల్లాలో కొంత మంది జర్నలిస్టులు ప్రతికూల వార్తలు వ్రాస్తామని అన్నవరం దేవస్థానం, సంక్షేమ హాస్టళ్ల అధికారులను ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడిన సంఘటనలు తన దృష్టికి వచ్చాయని, ఒకవేళ అక్రమాలు, తప్పులు జరిగి ఉంటే వార్తలు ప్రచురించాలే తప్ప, బెదిరింపులకు పాల్పడకూడదన్నారు. అటువంటి బెదిరింపులకు పాల్పడుతున్న జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టరు స్పష్టం చేసారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీలో వివిధ జర్నలిస్ట్ సంఘాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు తమ తమ సంఘాల ద్వారా జర్నలిజం పేరిట ఇటువంటి అవాంఛనీయ ధోరణులను అరికట్టేందుకు సహకరించాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో కమిటీ మెంబర్ కన్వీనర్, డిఐపిఆర్ఓ ఆర్.వి.ఎస్.రామచంద్రరావు, ఎక్స్ అఫిషియో సభ్యులు, డిఆర్ఓ టి. తిప్పే నాయక్, కమిటీ సభ్యులు ఎస్.శివన్నారాయణ రెడ్డి, ఎంఎన్. లక్ష్మణ్, జి.శోభన్ నవీన్ రాజ్ భాబు, వి.సాయినాథ్, కె.శ్రీనివాసరావు, టి.పల్లవరాజు, ఎస్.త్రిమూర్తులు, యం.కామేశ్వరరావు, పి.రాంబాబు, ఎన్.కె.దుర్రానీ, సిహెచ్.రాజారమేష్, సమాచార శాఖ ఏఈఐఈ సి.బాబూరావు, వైద్యఆరోగ్య, హౌసింగ్, ఆర్టీసీ, రైల్వే, కార్మిక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మీడియా డైరీని ఆవిష్కరించిన కాకినాడ జిల్లా ఎస్పీ

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ముద్రించిన మీడియా డైరీని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆవిష్కరించారు. ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎస్పీ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్‌లు ఎస్పీకి వివరించారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం కీలకంగా పోరాడుతున్న సంఘంగా రాష్ట్రవ్యాప్తంగా సంఘం గుర్తింపు పొందిందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపైనే కాకుండా సంక్షేమానికి ఫెడరేషన్ విశేషంగా కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ఆపదలో ఉన్న జర్నలిస్టులను ఆదుకోవడం కోసం నిరంతరం పనిచేస్తున్నామని చెప్పారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫెడరేషన్ ఆధ్వర్యంలో విన్నవిస్తుండగా పోలీసు శాఖ తీసుకుంటున్న చొరవ అభినందనీయమని ఈ సందర్భంగా వారు అన్నారు. అందరికీ ఉపయోగపడే సమాచారంతో డైరీని తీసుకొచ్చి అందజేయడం శుభ పరిణామమని ఎస్పి ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులకు తెలిపారు. ఎస్ బి డిఎస్పి కేవివి సత్యనారాయణకు కూడా డైరీను అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎండి అధికార్, మీడియా సెక్రెటరీ పుర్రె శ్రీనాథ్, జిల్లా నాయకులు డి. శ్రీధర్, కే. సత్య, ప్రవీణ్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



**కాకినాడలో ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్వర్యంలో నిర్వహించిన మీడియా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం**

# విశాఖలో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన







ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు, పునరుద్ధరణకు విశేష స్పందన లభించింది. దాదాపు పదిరోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నంలోని జర్నలిస్టులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చివర రోజు కూడా వంద మంది జర్నలిస్టులు తమ సభ్యత్వాన్ని నమోదు చేయించుకున్నారు. విశాఖ జిల్లా నుంచి సుమారు 600 మంది జర్నలిస్టులు ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లలో సభ్యులుగా చేరారు. సభ్యత్వ నమోదు సాగిన అన్ని రోజులు ఫెడరేషన్ నాయకత్వం మొత్తం బాధ్యత తీసుకుని విజయవంతంగా నెరవేర్చారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శివప్రసాద్, జాయింట్ సెక్రెటరీ కోస్తా మిర్రర్ ప్రసాద్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ ఈరోతి ఈశ్వరరావు, కార్యదర్శి మదన్, జాయింట్ సెక్రెటరీ త్రినాథ్, స్మాల్ పేపర్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి కె శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బొబ్బర్ ప్రసాద్, రాజశేఖర్ జగన్,హరి తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా పరిధిలోకి వచ్చే భీమిలి, మధురవాడ తదితర ప్రాంతాల్లో కూడా చురుకుగా సభ్యత్వ నమోదు సాగింది. స్థానికంగా ఉన్న నాయకులు బాధ్యత తీసుకుని సభ్యులను చేర్చారు.



# ఎన్టీఆర్ జిల్లాలో ప్రచార సంరంభం

చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం చేపట్టారు. జర్నలిస్టుల సమస్యల గురించి ప్రస్తావిస్తూ సభలు, సమావేశాల్లో నిర్వహించారు. అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి సభలు, సమావేశాలు జరిగాయి. విజయవాడ నుంచి బయలుదేరిన ఫెడరేషన్ బృందం ఒక్కరోజులోనే ఎన్టీఆర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించారు. అన్నిచోట్లా సమావేశాలు నిర్వహించి విజయవాడ కార్యక్రమానికి సంసిద్ధం చేశారు.











విజయవాడ నుంచి బయలుదేరి ముందుగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మైలవరం నియోజకవర్గంలోని జర్నలిస్టులతో సమావేశం నిర్వహించారు. ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. అక్కడి నుంచి నందిగామ చేరుకున్న ఫెడరేషన్ బృందానికి స్థానిక జర్నలిస్టులు స్వాగతం పలికారు. అక్కడ జరిగిన సమావేశంలో చలో విజయవాడకు సిద్ధం చేయడమే కాక నియోజకవర్గ కమిటీ ఎన్నిక కూడా జరిగింది. కొత్త కమిటీని ఎన్నుకున్నారు.

నందిగామ నుంచి బయలుదేరి జగ్గయ్యపేట చేరుకున్న ఫెడరేషన్ బృందం మధ్యాహ్న భోజనం ముగించుకుని స్థానిక జర్నలిస్టులతో సమావేశమయ్యారు. జగ్గయ్యపేట నుంచి విజయవాడ తరలివచ్చేందుకు అక్కడి విలేకరులు సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం ఫెడరేషన్ బృందం తిరువూరు చేరుకున్నారు. తిరువూరులో సమావేశం నిర్వహించి అక్కడున్న జర్నలిస్టులను చలో విజయవాడ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరడం వారు అందుకు తమ సమ్మతిని తెలియజేశారు. ఒకేరోజులో నాలుగు నియోజకవర్గాల్లో ఈ బృందం పర్యటించి మొత్తం ఎన్టీఆర్ జిల్లా జర్నలిస్టులను కదిలించింది. ఈ బృందంలో ఫెడరేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.బి.నాథన్ ఉన్నారు. వీరితో పాటుగా స్థానిక ఫెడరేషన్ కార్యకర్తలు కలిసి మొత్తం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కృష్ణా జిల్లాలో కూడా ఇదే రీతిలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటప్పయ్య, వై.శ్రీనివాసరావుల నేతృత్వంలో మరో బృందం ఉయ్యూరు, పెడన, పామర్రు తదితర ప్రాంతాల్లో పర్యటించింది. గోడపత్రికలు, కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి ఫెడరేషన్ ప్రచారాన్ని మండల స్థాయి వరకు తీసుకువెళ్లి అక్కడి నుంచి జర్నలిస్టులందరూ కలిసికట్టుగా కదిలేందుకు సిద్ధం చేశారు.

# సార్వత్రిక సమ్మెలో జర్నలిస్టులు












కార్మిక చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలతో పాటుగా నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలని దేశంలోని జర్నలిస్టులకు పిలుపిచ్చింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు రాష్ట్రంలో జాతీయ కార్మిక సంఘాల ఆందోళన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రాష్ట్రంలోని జర్నలిస్టులను కోరాయి. ఆ పిలుపు మేరకు వివిధ జిల్లాల్లో జర్నలిస్టులు కార్మిక సంఘాలతో పాటు ఆందోళన కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. ధర్నాలు, ప్రదర్శనలు, సభలు, సమావేశాలకు హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్లు తీసుకువచ్చింది. కేంద్రం రద్దు చేసిన చట్టాలలో జర్నలిస్టులకు సంబంధించిన వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ 1955, పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ 1958 కూడా ఉన్నాయి. జర్నలిస్టుల స్థితిగతులు జీతాలు ఇతర సౌకర్యాల గురించి ఇవి ప్రస్తావిస్తాయి. అయితే ఈ చట్టాల రద్దుతో జర్నలిస్టుల ఉనికికే ప్రమాదం ఏర్పడింది. అందువల్ల కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించే నిరసన ప్రదర్శనలు, బహిరంగ సభల్లో జర్నలిస్టులు కూడా పాల్గొని విజయవంతం చేయాలని నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియన్ పిలుపునిచ్చాయి. ఈ పిలువులో భాగంగా విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, కడప, చిత్తూరు, గుంటూరు, కాకినాడ ప్రాంతాలతో పాటు పలు నగరాలు, పట్టణాలలో జర్నలిస్టులు ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు.



# చలో విజయవాడకు సంసిద్ధం

అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు చలో విజయవాడ కార్యక్రమానికి సంసిద్ధంగా ఉండాలని పార్వతీపురం జిల్లాలోని జర్నలిస్టులకు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు పిలుపిచ్చారు. మన్యం పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఎన్‌జీవో హూంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశం, అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి జిల్లా కన్వీనర్ పట్నాయక్ అధ్యక్షత వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ డి.రవికుమార్, విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఎపిబిజెఎ నాయకులు ఈశ్వరరావు, మదన్‌లు హాజరయ్యారు. జిల్లాలోని జర్నలిస్టులను సంఘటితం చేసి చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఫెడరేషన్, ఎపిబిజెఎలు కృషి చేస్తున్నాయని ఆంజనేయులు చెప్పారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పర్యటించి జర్నలిస్టులను సంసిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. అన్ని జిల్లాల్లో జర్నలిస్టులు ఉత్సాహంగా చలో విజయవాడ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇది జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే గిరిజనులకు కూడా ఇళ్లపట్టాలు రాని స్థితి ఉన్నదని, ఇక గిరిజనేతర జర్నలిస్టుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, ఈ పరిస్థితి మారేందుకు మన ఐక్యత మాత్రమే మార్గమని స్పష్టం చేశారు. ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

# అదానీ “పరువు నష్టం”లో జర్నలిస్టుకు జైలు శిక్ష

రవి నాయర్ అనే జర్నలిస్టుకు గుజరాత్ కోర్టు ఒకటి ఒక యేడాది జైలు శిక్షను విధించింది. ఈ దేశ బడా కుబేరుడు,ఏలికకు అత్యంత సన్నిహితుడు కూడా అయిన పారిశ్రామిక వేత్త “పరువుకు నష్టం” కలిగించే పలు కథనాలు రాసాడని నిర్ధారిస్తూ ఒక యేడాది జైలు శిక్షతో పాటు ఐదువేల రూపాయల జరిమానాను విధించింది.

2020–21 మధ్య కాలంలో రవి నాయర్ అదానీ పారిశ్రామిక వ్యవస్థపై ఆధారాలు లేని అనేక కథనాలు రాసాడని ట్వీట్లు చేశాడని కేసు నమోదైంది. కథనాల వెనక ఆయన ఉద్దేశ్యం పరువుకు నష్టం కలిగించడమేనని సంస్థ వాదించింది. విమర్శ స్థాయిని దాటి ఆయన కథనాలున్నాయని సంస్థ వాదించింది. వాటిని రవి తిరస్కరించారు. కానీ అవి అన్నీ నిరాధారమైన తప్పుడు కథనాలని విచారణ వ్యవస్థ సమర్పించిన ఆధారాలతో కోర్టు ఏకీభవించింది. దీంతో ఆయన దోషిగా తేల్చుతూ శిక్షను ఇటీవల ఖరారు చేసింది.



# జర్నలిస్టుల సమస్యలపై చలో విజయవాడ

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు తెలిపారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిడిచక్రవర్తి, శేఖర్ రహీమ్ రహమతుల్లా ఆధ్వర్యంలో అల్లూరు జిల్లా కేంద్రంలో పాడేరులో సమావేశం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు ఏపిడబ్ల్యుజెఎఫ్ కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ఈశ్వరరావు, విశాఖ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు ఏపీ బ్రాడ్కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు, కార్యదర్శి కె మదన్, పాడేరు, అరకు నియోజకవర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ కృషి

అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టాయని రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు కోరారు. అనకాపల్లి సిపిఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని జర్నలిస్టులను సంఘటితం చేసి చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ నాయకులు పర్యటిస్తున్నారని అందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించడం జరిగిందని తెలియజేశారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు మూడు సెంట్లు చొప్పున భూమి కేటాయిస్తామని గత ప్రభుత్వం జీవో జారీ చేసి దరఖాస్తులను స్వీకరించిందని వారికి స్థలాలు కేటాయింపు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ డిమాండ్ చేస్తుందని అన్నారు. అలాగే మీడియా సమావేశం కమిషన్ ఏర్పాటు చేయాలని సమాజంలో మారిన పరిస్థితుల దృష్ట్యా జర్నలిజం వృత్తి ప్రమాదంలో పడిందని జర్నలిస్టుకు రక్షణ కొరబడిందని రక్షణ లేని వృత్తిగా జర్నలిజం ప్రపంచ దేశాల్లో 149వ స్థానంలో ఉందని అన్నారు. భద్రతా పని పరిస్థితులు ఇతర సదుపాయాలు తదితర అంశాలు అన్నిటిపై అధ్యయనం చేసేందుకు మెరుగైన చర్యలు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే దేశంలోని దాదాపు 18 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వాలు పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని, మన రాష్ట్రంలో జర్నలిస్టులకు వాటన్నిటికన్నా మెరుగైన పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు వీలుగా ఒక కమిటీని నియమించాలని కోరాడు. ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ సంక్షేమ నిధి ఉందని మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తాత్కాలిక భరోసా కల్పించేందుకు మూడేళ్ల పాటు నెలకు వెయ్యి రూపాయలు పెన్షన్‌గా ఇచ్చే ఏర్పాటు ఉందని ఆ మొత్తాన్ని ఐదువేలకు పెంచే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టేందుకు వీలుగా రాష్ట్రంలో హోం శాఖ హోం మంత్రి నేతృత్వంలో హైపవర్ కమిటీ, జిల్లాల్లో ఉన్నత పోలీసు అధికారులతో కూడిన కమిటీలు వేసేందుకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ కమిటీలు లేవని అన్నారు. కార్మిక శాఖ పరిధిలో అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు కల్పిస్తున్న భీమా పథకం అమలుకు జర్నలిస్టులకు వర్తింపజేసేందుకు వీలుగా కార్మిక శాఖ కమిషనర్ ప్రతిపాదనలు పంపారని, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు బి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి విశాఖ సిటీ కార్యదర్శి జి శ్రీనివాస్, ఏపీబీజేఏ విశాఖ జిల్లా అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు, కార్యదర్శి మదన్, అనకాపల్లి పాత్రికేయులు పాల్గొన్నారు.

FORM IV

(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT,1867 STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT PERIODICAL WORKING JOURNALIST SAMACHAR SRAVANTHI

1. Place of Publication : Hyderabad
2. Periodicity of its Publication : Monthly
3. Printer's Name : G.Anjaneyulu on behalf of Andhra Pradesh Working Journalists' Federation
   (a) Whether a citizen of India : YES
   (b) if a foreigner, the country of origin :

Address : 402, Surabhi Sapphire, olconda 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020

4. Publisher's Name : G.Anjaneyulu on behalf of Andhra Pradesh Working Journalists' Federation
   (a) Whether a citizen of India : YES
   (b) if a foreigner, the country of origin :

Address : 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020

5. Editor's Name : G.Anjaneyulu

Nationality : INDIAN
   (a) Whether a citizen of India : YES
   (b) if a foreigner, the country of origin :

Address : H.No.12-2-831/53,F-201,MIGH59, Venkat Homes, Mehidipatnam, Hyderabad - 500 028

6. Name and Addresses of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the total capital: ANDHRA PRADESH WORKING JOURNALISTS' FEDERATION

I, G.Anjaneyulu on behalf of Andhra Pradesh Working Journalsits' Fed eration, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 28-02-2026 Sd/- G.Anjaneyulu

# వర్కింగ్ జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయం

జిల్లా అభివృద్ధిలో వర్కింగ్ జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని వారి సేవలు అభినందనీయమని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ కొనియాడారు.. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ 2026 వార్షిక డైరీని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులతోనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు కూడా సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్లు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎప్పటికప్పుడు జర్నలిస్టులు సమస్యలను తెలియజేసి పరిష్కారానికి తమ యూనియన్ల ద్వారా కృషి చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు.. ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి రవికుమార్.. పిఎస్ ప్రసాద్. ఉపాధ్యక్షులు బందారు శివప్రసాద్ పి నగేష్ బాబు, టి .కృష్ణమూర్తి నాయుడు, భాగ్యరాజు, బ్రాడ్ కాస్ట్ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మళ్ళదేవ త్రినాథ్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ ఎస్ జగన్మోహన్, ఉపాధ్యక్షులు డి చక్రపాణి, కొణతాల శ్రీనివాస్, కోశాధికారి కేవి శర్మ, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, కార్యవర్గ సభ్యుడు అరుణ్ భాస్కర్ (హరి), సభ్యుడు ఎం హరనాథ్. పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు. తొలుత గంట్ల శ్రీనుబాబు జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

జర్నలిస్టుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కృషిచేస్తోందని, సమస్యల పరిష్కారానికి కూడా చొరవ చూపుతోందని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమంలో ఆధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్ నాయుడు అధ్యక్షతన స్థానిక మయూర హోటల్లో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని మండకాల్లో వివిధ పత్రికలు, చానళ్లకు చెందిన జర్నలిస్టులు హాజరయ్యారు. సమావేశం అనంతరం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎ.పి. డబ్ల్యుజెఎఫ్) కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని జర్మనిస్టులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టులకు. ఇళ్లస్థలాల కేటాయింపు సమస్య చాలాయేళ్లుగా అపరిష్కృతంగా ఉంది. ఎన్నికల సమయంలోనే జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రణాళికలో ప్రకటించడంతో అందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. జర్నలిజం రక్షణ లేని వృత్తిగా మారిపోయిందని ఈనేపథ్యంలో భద్రత, పనిపరిస్థితులు, ఇతర సదుపాయాలు తదితర అంశాలన్నింటిపై అధ్యయనం చేసేందుకు మెరుగైన చర్యలు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం మీడియా కమిషను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని దాదాపు 18 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వాలు పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. మన రాష్ట్రంలో జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తాత్కాలిక భరోసా కింద మూడేళ్ల పాటు నెలకు 1000 చొప్పున చెల్లిస్తున్న ఆర్థిక సాయాన్ని ఐదువేలకు పెంచాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆరోగ్యబీమా ద్వారా ప్రతి ఆరునెలల కొకసారి జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షల సదుపాయం కల్పించాలని కోరారు. పిల్లలకు ఉచితంగా అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకునే సదుపాయం కన్పించాలని కోరుతున్నామన్నారు. జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టేందుకు వీలుగా రాష్ట్రంలో హెూం శాఖ మంత్రి నేతృత్వంలో హైపవర్ కమిటీ, జిల్లాలో ఉన్నత పోలీసు అధికారులతో కమిటీలు చేసేందుకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఏర్పాటు చేయలేదని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ ఫండ్ కమిటీ తక్షణమే పునరుద్ధరించాలని, వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ ఫండ్ 50కోట్లను కేటాయించాలని కోరుతున్నామన్నారు. మీడియా అకాడెమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల అవార్డులు ప్రదానం చేయాలని, కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలని, ఆరోగ్యబీమా పథకం అమలు తీరు తెన్నులపై జర్నలిస్టుల్లో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి చాలాయేక్కుగా ఈ పథకం అమలవుతున్నా ప్రతియేటా రెన్యువల్ చేయడంలో చాలా జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. మురళి శంకర్రావు, జిల్లా కార్యదర్శి ఆర్ వ్యాసంబాబు, నాయకులు బూరాడ శ్రీనివాసరావు, ఎన్. మధుసూదనరావు, విశాఖపట్నం జిల్లాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డు వరకు జర్నలిస్టులంతా ప్రదర్శన నిర్వహించారు. కార్మికుల హక్కుల పరిరక్షించాలని, మీడియాను కాపాడాలని నినాదాలు చేశారు.

# సమస్యల పరిష్కారానికే చలో విజయవాడ




రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలు పరిష్కారం కోసమే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు తెలిపారు. విశాఖపట్నం డాబాగార్డెన్స్ వైజాగ్ జర్నలిస్ట్ ఫోరమ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయులు సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు.. గత రెండు ప్రభుత్వాల హయాంలో కూడా ఇళ్ల స్థలాలు.. ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.. అలాగే జర్నలిస్టులు పిల్లలకు ఉచిత విద్యను అందించాలని జర్నలిస్టులకు ఉచిత వైద్యము అందించాలని కోరుతున్నామన్నారు.. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పెద్ద ఎత్తున భూములు.. రాయితీలు ఇస్తున్నందున తద్వారా జర్నలిస్టులకు వారి నుంచి విద్య వైద్యం విషయాల్లో సహాయం చేయాలి అన్నారు.. ఇతర రాష్ట్రాల్లో పెన్షన్ పథకం అమలవుతున్న ఆంధ్రప్రదేశ్‌లో అమలుకు నోచుకోలేదన్నారు.. ఇప్పటికే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, తదితర మంత్రులకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాలు అందజేశామన్నారు.. చాలావరకు సుదీర్ఘకాలం నుంచి పరిష్కారం కావాల్సి ఉందన్నారు.. అందువల్ల చలో విజయవాడ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించి అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సభ నిర్వహిస్తామన్నారు . ఈ సభకు సమాచార పౌర సంబంధాలు, కార్మిక శాఖ మంత్రులను ఆహ్వానించడం జరుగుతుంది అన్నారు.. చలో విజయవాడ కార్యక్రమానికి అద్భుతమైన స్పందన లభిస్తుందని అందులో భాగంగా ఉత్తరాంధ్రలో సన్నాహక సమావేశాలు నిర్వహించడం పూర్తి చేసామన్నారు.. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఏజే) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు.. విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ లు మాట్లాడుతూ శ్రీకాకుళం.. విజయనగరం పార్వతీపురం.. అల్లూరి. అనకాపల్లి . విశాఖ జిల్లాల్లో నిర్వహించిన సమావేశాలు పూర్తిగా విజయవంతమైనట్లు చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.. ఇటీవల విశాఖ జిల్లాలో నిర్వహించిన ఫెడరేషన్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది అన్నారు.. అనంతరం ఆంజనేయులు.. గంట్ల శ్రీనుబాబు లను ఘనంగా సత్కరించారు

సమావేశంలో విశాఖ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, డిప్యూటీ సెక్రటరీ ఏ. సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వెంకటేష్,కార్యదర్శి ఖాదర్, ఏపీబీజేఏ అధ్యక్షులు భాషా, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఇ. ఈశ్వరరావు, కార్యదర్శి కె. మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు పెద్ద ఎత్తున కార్యవర్గ సభ్యులు జర్నలిస్టులు పాల్గొన్నారు.



**ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావును సత్కరించిన అనకాపల్లి జర్నలిస్టులు, పక్కన జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్**



# ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు పేర్కొన్నారు. ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాలు శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. నగరంలో స్థానిక ఎన్జీవో హంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో పలు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పెన్షను సౌకర్యం ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ఆ అవకాశం కల్పించాలన్నారు. జర్నలిస్టులకు రక్షణకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులకు, వారి కుటుంబసభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు సదుపాయం కల్పించాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో ఉచిత విద్య కల్పించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి 50 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు కమిటీల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు అవార్డులు అందించడంతోపాటు వారికి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జర్నలిస్టులకు వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ జర్నలిస్టుల సంఘం ( ఎన్ ఎ జె) కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘకాలంగా తమ సంఘం పోరాడుతుందని జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం పనిచేస్తుందన్నారు. అన్ని జిల్లాల్లో జర్నలిస్టులు సమష్టిగా పనిచేస్తూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఛలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టడం శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సంఘం పనిచేస్తుందని గతంలో కూడా ఛలో విజయవాడ, సమావేశాలకు శ్రీకాకుళం జిల్లా నుండి పెద్దఎత్తున జర్నలిస్టుల హాజరైన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికల్లో, లోకల్ టీవీ ఛానెళ్లల్లో పనిచేసే జర్నలిస్టులకు నియోజకవర్గానికి ఒకటి, జిల్లా కేంద్రంలో డెస్క్ జర్నలిస్టులకు గతంలో అక్రిడిటేషన్లు ఇచ్చేవారని, అదే పద్ధతిని అవలంభించాలని కోరారు. మీడియా అకాడమి గవర్నింగ్ బాడీలో జర్నలిస్టుల సంఘాలకు ప్రాతినిధ్యం ఉండాలని, జర్నలిస్టులందరికీ రైల్వే పాసులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలోను జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తామని చెబుతూ ఆ తర్వాత వాటిని విస్మరిస్తున్నారన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ, జి .శ్రీనివాస్‌రావు ఏపీబీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇ.ఈశ్వరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మణరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా బాధ్యులు సువ్వారి మురళీధర్, డి.ఆనందరావు, తోట భీమారావు, బగాది వాసుదేవరావు, జి.నర్సింగరావు, బేరి చిన్నారావు, బహదూర్‌భాషా, ఎస్.విజయ్‌కుమార్, వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు ఎస్.జోగినాయుడు, జి.షణ్ముఖరావు, ఒంపూరు రమేష్, రాధాకుమారి, రౌతు సూర్యనారాయణ, గంజి ఆర్.ఎజ్రా, కిల్లి శ్రీను, ఎం.సుదర్శన్, డి.హేమసుందర్, భాసూరు సాయి, సీపాన రమేష్, కె.కొండబాబు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆంజనేయులును ఎన్జీజీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతుసాయిరాం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయి వేణుగోపాల్, చల్లా శ్రీనివాస్, శ్రావణి, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్ కొంక్యాన మురళీధర్ శాలువా కప్పి సత్కరించారు.

# కార్మిక హక్కులు కాలరాసే 'లేబర్ కోడ్'లు

**బి దీపక్ భలేరావు**

భారత కార్మికోద్యమం 1925 నుండి అనేక పోరాటాలను నిర్వహించింది. ఆ ఉద్యమం స్వతంత్ర భారతానికి పూర్వం, అనంతరం పలు కార్మిక అనుకూల లేబర్ చట్టాలను రూపొందించేందుకు ప్రభుత్వంపై వత్తిడి చేసింది. విజయం సాధించింది. కానీ శతాబ్ద కాలంపాటు కార్మికులు శ్రమించి సాధించుకున్న ఈ హక్కులను కాలరాసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నించింది. కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశ పెట్టింది.

నాలుగు నూతన లేబర్ కోడ్ల వాస్తవికత ఏమిటి?

మొదటిది. 2019 వేతనాల కోడ్. అది వేతనాలు చెల్లింపు చట్టం,
1936; కనీస వేతన చట్టం,
1948; బోనస్ చెల్లింపు చట్టం,
1965; సమాన వేతన చట్టం 1976ల కలబోతగా రూపొందింది.

రెండవది. పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020, అది - ట్రేడయూనియన్ చట్టం, 1926; పారిశ్రామిక ఉపాధి చట్టం, 1946; పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లతో కలిపి రూపొందించబడింది.

మూడవది. వృత్తి పరిరక్షణ, ఆరోగ్య పని నిబంధనల కోడ్, 2020.

ఈ కోడ్ - ఫ్యాక్టరీల చట్టం, 1948;
ప్లాంటేషన్ లేబరు చట్టం, 1951;
గనుల చట్టం, 1952;
మోటార్ రవాణా కార్మిక చట్టం, 1961:
బీడీ, సిగార్ కార్మిక చట్టం, 1966లలోని కొన్ని క్లాజులను కలగలిపి తేబడింది. వాటితో పాటు ఇదే కోడ్‌లో...
కాంట్రాక్టు లేబరు చట్టం, 1970;
ది సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల చట్టం, 1976;
అంతర రాష్ట్ర వలస పనివారల చట్టం, 1979;
సినీ కార్మికులు మరియు సినిమా థియేటర్ల కార్మిక చట్టం, 1981;
డాక్ వర్కర్స్ చట్టం, 1986;
భవనము ఇతర నిర్మాణ కార్మిక చట్టం, 1996 కూడా చొప్పించబడ్డాయి.

నాలుగవది. సామాజిక పరిరక్షణ కోడ్, 2020. ఈ కోడ్, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ చట్టం, 1952;
ఉద్యోగుల స్టేట్ బీమా చట్టం,1948;
ది ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి చట్టం, 1959;
ప్రసూతి ప్రయోజనాల చట్టం, 1961;
గ్రాట్యుటీ చెల్లింపు చట్టం,1972,
సినీ కార్మి కుల సంక్షేమ నిధి చట్టం, 1981;
భవన నిర్మా ణ కార్మిక చట్టం, 1996, అసంఘటిత రంగం కార్మికుల సామాజిక భద్రతా చట్టం, 2008 లలోని పలు క్లాజులు కలగలిపి ఏర్పాటయింది.

కార్మికుల డిమాండ్లు 1925 నుండి కార్మికులు పోరాటాల ద్వారా అనేక హక్కులను సాధించుకున్నారు. అయితే వాటికి కొన్ని పరిమి తులు కూడా ఉన్నాయి. 1965 నుండి వార్షిక వేతనం లేదా జీతంలో బోనస్ 8.33 శాతానికి పరిమితం చేశారు. కొత్త కార్మిక కోడ్లలో ఆ పరిమితిని 12 శాతానికి పెంచాలని కార్మిక సంఘాలు డిమాండుచేశాయి. గతంలో ఒక ఫ్యాక్టరీ మూసివేత లేదా లే- ఆఫ్ చేసిన సందర్భంలో సంవత్సరానికి 15 రోజుల చొప్పున పరిహారం చెల్లించ వలసివుండేది. కార్మిక సంఘాలు, ఆ పరిహారాన్ని సంవత్సరానికి కనీసం 30 రోజులకు చెల్లించాలని డిమాండ్ చేశాయి. కార్మికుల ప్రయోజనం కోసం ఇంకా అనేక ఇతర డిమాండ్లను కూడా చేశాయి..

అదేవిధంగా, 5 సంవత్సరాలు పూర్తి చేసిన ఉ ద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు గణనను సంవత్సరానికి 15 రోజుల వేతనం రేటు నుండి 30 రోజుల వేతనానికి పెంచాలనేది మరొక డిమాండ్. అలాగే, ట్రేడ్ యూనియన్లకు గుర్తింపును రహస్య బ్యాలెట్ ద్వారా నిర్ణయించాలని డిమాండ్ చేశాయి. ఒక యూనిట్‌లో ఒక్క కార్మికుడు పనిచేస్తున్నప్పటికీ, ఆ సంస్థ కార్మిక చట్టాల పరిధిలోకి రావాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కానీ కొత్త లేబర్ కోడ్ల ప్రకారం ఒక సంస్థ కనీసం 40 మందికి ఉపాధి కల్పిస్తేనే ఆ సంస్థలో కార్మిక చట్టాలు అమల్లోకి వస్తాయి.

ఇంకా, కార్మిక సంఘాలు ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) నిర్వచించిన విధంగా, గృహ కార్మికులకు కార్మిక హటరీదాను కోరుతున్నాయి. కార్మికులు, యజమానుల మధ్య జరిగే పోరులో, ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం నిలబడాలని కూడా కోరుతున్నాయి. ప్రభుత్వం, ఒక వైఖరి తీసుకొని కార్మికులకు న్యాయం చేయడానికి జోక్యం చేసుకోవాలని అవి డిమాండుచేస్తున్నాయి.

వీటితోపాటు, ప్రతి సంస్థలో కార్మిక చట్టాల అమలును తప్పనిసరి చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత కార్మికులుగా నియమించాలని కార్మిక సంఘాలు పట్టుబట్టాయి. ప్రభుత్వ రంగంలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని కోరాయి. కానీ కొత్త లేబర్ కోడ్లు ఈ డిమాండ్లలో దేనినీ పరిగణనలోకి తీసుకోలేదు. ప్రభుత్వం మొత్తం 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా కుదించింది. కార్మిక సంఘాలు చేసిన ప్రగతిశీల డిమాండ్లు అన్నింటినీ విస్మరించింది.

భాగస్వాములతో ఎలాంటి సంప్రదింపులూ లేవు గతంలో ప్రభుత్వం, యజమానుల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి కూర్చొని కొత్త చట్టాల ముసాయిదాను రూపొం దించేవారు. కానీ 2015 నుండి, ఈ త్రైపాక్షిక వ్యవస్థను మోడీ ప్రభుత్వం వదిలేసింది. కొత్త కార్మిక కోడ్ల సహా, ఏ ఇతర కార్మిక చట్టాలకు సంబంధించి 2015 నుండి ఒక్క సమావేశం కూడా జరపలేదు.

కార్మికులు, తాము ఎదుర్కొంటున్న

అన్యాయాలను ఇంకేమాత్రమూ భరించలేని స్థితికి చేరారు. దానితో వారు మొదట ఐక్యమైనారు. తర్వాత అనేక దశాబ్దాలుగా అనేక కష్టనష్టాలను ఎదిరించి కార్మిక సంస్థలు నిర్మించబడ్డాయి. అందుకే 1926 నుండి ఏడుగురు కార్మికులు చేతులు కలిపినా కూడా యూనియన్ ఏర్పాటు చేసుకోవచ్చన్న నిబంధన సాధించబడింది. ఇప్పుడు కొత్త లేబరు కోడ్లు, "మొత్తం కార్మికుల సంఖ్యలో కనీసం 10 శాతం లేదా 100 మంది కార్మికులు (ఏది తక్కువైతే అది) లేకుండా, ఒక సంస్థ యొక్క విభాగంలో కార్మిక సంఘాలు ఏర్పాటు చేయబడవు" అని ప్రకటిస్తున్నాయి. దానితో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుడి ప్రాథమిక హక్కును దెబ్బ తీసింది.

ఈ ప్రక్రియ భారత రాజ్యాంగం నిర్వ చించిన "సంఘటితమయ్యే" ప్రాథమిక హక్కుకు పూర్తిగా విరుద్ధమైనది. దీనివల్ల కొత్త కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడానికి అనుమతి లభించదు. కార్మికులు తమంతట తామే తమ సమస్యలను పరిష్కరించుకోవలసి వస్తుంది.

కార్మికులకు కాదు, పారిశ్రామికవేత్తలకే అనుకూలం

"పారిశ్రామిక సంబంధాల కోడ్"అనే పేరు కూడా.. ఇది కార్మికుల సంక్షేమం కోసం కాదని, పారిశ్రామికవేత్తలను సంతోషపెట్టేందుకే రూపొందించబడిందని స్పష్టంచేస్తున్నది. 1925 నుండి 2025 వరకు 100 సంవత్సరాల పాటు అమలులో ఉన్న కార్మిక చట్టాలు యజమానికీ, కార్మికుడికీ మధ్యగల వాస్తవ ఘర్షణను బట్ట బయలు చేశాయి. కానీ దానిని పారిశ్రామిక సంబంధాల కోడు"గా బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం మార్చింది. తద్వారా, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసింది.

మోడీ ప్రభుత్వం, కార్మిక చట్టాల విధాన నిర్ణయాలు తీసుకునే విషయంలో అతిపెద్ద మార్పు తెచ్చింది. ఇకపై, కార్మిక చట్టాల సూక్ష్మ వివరాలపై నిర్ణయాలను ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కాకుండా, 'ఉన్నత అధికార గణం' తీసుకుంటుంది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష . ఉన్నత అధికార గణం తప్పనిసరిగా ఆనాటి ప్రభుత్వానికి విధేయత చూపడానికి ప్రయత్నిస్తారు. ఎన్నికైన ప్రతినిధులు చట్టాలలో మార్పులు చేసి, సవరణలు సూచించి, శాసనసభలలో వాటిని వ్యతిరేకించవచ్చు లేదా సమర్థించవచ్చు. కానీ ఇకపై, చట్టాలు ఉన్నత అధికారుల కార్యాలయాలల్లోనే రూపొందించబడతాయి. ఫలితంగా చర్చలు, సంప్రదింపుల ప్రాథమిక భావన కనుమరుగవుతుంది

కీలకమైన చట్టాలను పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేస్తున్న ధోరణి ఇటీవల పెరిగింది. దానికి అనుగుణంగా, కొత్త "కార్మిక కోడ్"లను లోక్‌సభలో కేవలం 20 నిమిషాల్లోనే ఆమోదం పొందగలిగారు.

సమ్మెలను అడ్డుకునే నిబంధన

కొత్త 'కార్మిక కోడ్'లతో ఉన్న మరో సమస్య ఏమిటంటే, అవి కార్మికుల 'సమ్మె ఆయుధాన్ని' నాశనం చేస్తాయి. సాధారణంగా సమ్మెను చివరి అస్త్రంగా చూస్తారు. కార్మికుల డిమాండ్లను పదే పదే విస్మరించినప్పుడు మాత్రమే వారు అత్యవసర సేవల్లో మినహా సమ్మె చేసే అవకాశం ఉండేది. 1968 నాటి 'అత్యవసర సేవల నిర్వహణ చట్టం' రవాణా, ఆరోగ్య సంరక్షణ, పోలీసు, అగ్నిమాపక సేవలు వంటి ప్రభుత్వ సేవలకు వర్తిస్తుంది. కానీ కొత్త కార్మిక కోడ్లను అమలులోకి తీసుకురావడంతో, ఏ కార్మికుడూ సమ్మె చేయరాదని మోడీ ప్రభుత్వం నిర్ధారించుకుంది. ఇప్పుడు, సమ్మెకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. ఆ 14 రోజులలోపు కార్మిక శాఖ కార్మికుల డిమాండ్లపై విచారణ జరిపితే, అప్పుడు సమ్మె చేయడానికి వీలు లేదు. అలాగే, డిమాండ్లపై కోర్టు విచారణ పెండింగ్‌లో ఉంటే, మళ్లీ సమ్మెకు అనుమతి లేదు. ఇవన్నీ సమ్మెలను నిరోధించడానికి ఉద్దేశించిన మార్గాలు తప్ప మరొకటి కాదు. ఒకవేళ కార్మిక సంఘాలు ముందుకెళ్లి సమ్మెకు పిలుపునిస్తే, కొత్త చట్టాల ప్రకారం, అందులో పాల్గొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. ఇది కార్మికులను నిస్సహాయులుగా మార్చేస్తుంది. వారిని నిస్సహాయ స్థితికి నెట్టేస్తుంది. ఇక, వారు సంవత్సరాల తరబడి కొనసాగే కోర్టు కేసులలో చిక్కుకునే ప్రమాదంలో చిక్కుకుంటున్నారు.

కొత్త చట్టాలు అనేక ఆంక్షలను కూడా విధించాయి. ఇప్పుడు, "సమ్మె" అనే పదాన్ని 50 శాతానికి పైగా కార్మికులు సెలవు తీసుకునే పరిస్థితిగా పునర్నిర్వచించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలలో పాల్గొనకుండా కార్మికులను ఇప్పుడు నిషేధించారు. నామమాత్రపు నిరసనగా ఇతరుల సమ్మెలలో పాల్గొనడం కూడా ఇకపై అనుమతించబడదు. ఈ చట్టాలతో సమ్మెకు సంబంధించిన ఇతర అన్ని మార్గాలను కూడా రద్దు చేశారు. ఇది యజమానులకు పూర్తి పైచేయినిస్తుంది. ఫలితంగా కార్మికుల హక్కులు, విశేషాధికారాలు విస్మరించబడతాయి. ఉద్యోగ భద్రత, రక్షణలు క్షీణించాయి. కొత్త కార్మిక చట్టాలు ఉద్యోగ భద్రతపై కూడా తీవ్ర ప్రభావం చూపాయి. గతంలో,

కార్మిక హక్కులు కాలరాసే 'లేబర్ కోడ్'లు

100 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులతో ఒక పరిశ్రమను ఏర్పాటు చేస్తే, ఉద్యోగాల తొలగింపులు జరిగినా లేదా సంస్థ మూతబడినా కార్మికులకు రక్షణ ఉండేది. కార్మికులందరికీ పరిహారం, ప్రయోజనాలు లభించేవి. కొత్త 'కార్మిక కోడ్'ల ప్రకారం, ఇది 300 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులున్న కంపెనీలకు మాత్రమే వర్తిస్తుంది. ఇది స్పష్టంగా కార్మికుల ప్రయోజనాలకు నష్టదాయకంగా ఉంది. అందుకే, ట్రేడ్ యూనియన్లు ఈ విధానాన్ని పాత 100 మంది కార్మికుల పరిమితికి మార్చాలని డిమాండ్ చేశాయి. కానీ మోడీ ప్రభుత్వం ఈ డిమాండ్ను పట్టించుకోలేదు. దీనివల్ల కంపెనీలలో ఉపాధి పెరుగుతుందన్న సాకులు చెబుతున్నారు. కానీ అది జరిగే అవకాశం లేదు.

'పర్మిట్ రాజ్' ముగిసిన తర్వాత కార్మికుల భద్రత, రక్షణను యజమానులే చూసుకుంటారని గొప్పగా ప్రచారంచేశారు. కానీ గత ఐదేళ్ల డేటాను పరిశీలిస్తే, 'బాయిలర్ పేలుళ్ల వంటి ఎన్నో దుస్సంఘటనలు జరిగాయి. వాటిలో బాధిత కార్మికులకు

పరిహారం లభించలేదు. ఇప్పుడు, మోడీ ప్రభుత్వం యజమానులకు అనుకూల చర్యలను మరింత సులభతరం చేసింది. కొత్త కార్మిక చట్టాల ప్రకారం, వారు మొదటిసారి చేసిన నేరం అయితే, యజమాని తనపై విధించిన జరిమానాలో కేవలం 50 శాతం చెల్లించి తప్పించుకోవచ్చు. కార్మికుల భద్రత, రక్షణకు సంబంధించిన అన్ని రకాల సమస్యల నుండి తమ బాధ్యత నుండి తప్పించుకునేందుకు యజమానులకు ఇది ఒక లొసుగుగా ఉపయోగపడుతుంది. కాబట్టి, ఇకపై స్థానిక కార్మిక అధికారులతో మంచి సంబంధాలున్న యజమానులు, ప్రతి నేరాన్ని మొదటిదిగా చిత్రీకరించి తప్పించుకుంటారు.

మోడీ ప్రభుత్వం కొత్త 'కార్మిక కోడ్'లతో కార్మికుల భద్రత, రక్షణ నిబంధనలను బలహీనపరచింది. అంతేగాక, "సమాన పనికి సమాన వేతనం" గురించి కూడా పరిపాలనా విభాగం చాలా హడావిడి చేస్తోంది. కానీ, 'సమాన పనికి -సమాన వేతనం' డిమాండుపై ఉద్యోగుల స్వభావం, ఉద్యోగ ప్రొఫైల్ విషయంలో, అది కేవలం లింగ ఆధారిత సమానత్వానికి మాత్రమే పరిమితం చేయబడింది. కాంట్రాక్ట్ కార్మికులు, శాశ్వత కార్మికుల మధ్య వేతన సమానత్వం సంగతేమిటి? కాంట్రాక్ట్ కార్మికుడు, శాశ్వత కార్మికుడితో సమానమైన పని చేస్తుంటే, ఇద్దరికీ సమాన వేతనం ఇవ్వాలి. కానీ కొత్త చట్టాలు దీన్ని గురించి ఒక్క మాట కూడా మాట్లాడవు. కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో, కొత్త కార్మిక చట్టాలు యజమానులకు తప్పించుకునే మార్గాన్ని సృష్టించాయి. మోడీ ప్రభుత్వం "స్థిర-కాల(ఫిక్స్ టరమ్) కాంట్రాక్టు అనే కొత్త పదాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పుడు, ఒక కార్మికుడి ఉద్యోగ కాల పరిమితి ఎంత ఉండాలనే దానిపై యజమానులదే తుది నిర్ణయం. అది 1 నెల, 1 రోజు లేదా 11 నెలలు కావచ్చు. పని ప్రదేశంలో, కొత్త కార్మిక చట్టాలు కార్మికుల భద్రతాపరమైన బాధ్యత నుండి తప్పించుకునేందుకు యజమానులకు లొసుగులను అందిస్తాయి.

మోదీ ప్రభుత్వం 'కొత్త గ్రాట్యుటీ నియమాలు' గురించి కూడా ప్రచారం చేస్తోంది. 'గ్రాట్యుటీ' అనే పదం ప్రాథమికంగా కార్మికుణ్ణి వృద్ధాప్యంలో ఆదుకునే 'నిధులకు హామీ' ఇచ్చేదిగా నిలుస్తుంది. ఇప్పుడు, కార్మికులు ప్రతి 11వ నెలకు గ్రాట్యుటీని పొందినట్లయితే, వారు వృద్ధాప్యానికి చేరుకునే ముందు ఆర్థిక హామీని పూర్తి చేస్తారు. ఇది 'వ్యాపార సౌలభ్య చర్య'గా ప్రశంసించ బడుతోంది, కానీ వాస్తవానికి ఇది కార్మికులను సులభంగా దోపిడీ చేయడానికి వీలు కల్పిస్తుంది.

కొత్త కార్మిక కోడ్లను కార్మికుల సంక్షేమంలో ఒక విప్లవాత్మక చర్యగా కీర్తిస్తున్నారు.

కానీ వాస్తవానికి అవి కాలాన్ని వెనక్కి నెడుతున్నాయి పరిశ్రమను స్థాపించడానికి యజమానులకు 'సింగిల్ విండో సిస్టం' వంటి సౌకర్యాలు లభిస్తున్నాయి. అలాంటి ఈ రోజుల్లో, కార్మికులు తమ భవిష్య నిధి, గ్రాట్యుటీ, బకాయిల చెల్లింపు, బోనస్ హక్కు మొదలైన వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగవలసి వస్తోంది. మోడీ ప్రభుత్వ చట్టాలు కార్మికులకు కష్టాలను పెంచాయి.

ఇది సమైక్యంగా కదలాల్సిన సమయం ట్రేడ్ యూనియన్లు నిష్క్రియగా కూర్చుని జరుగుతున్నదంతా చూస్తూ ఉండరాదు. వాటి పోరాట చరిత్ర సుదీర్ఘమైనది, గంభీరమైనది. 1920వ దశకంలో, భారతదేశంలోని కార్మికులందరూ ఏకమై తమ హక్కుల కోసం పోరాడాలనే ఉద్దేశ్యంతో "అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్"ను స్థాపించుకున్నారు. అప్పట్లో, మిల్లుల యజమానులకు బ్రిటిష్ ప్రభుత్వం నుండి విస్తృత మద్దతు లభించేది. నేడు, యజమానులకు మోడీ ప్రభుత్వం నుండి కూడా అలాంటి మద్దతు లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో, ట్రేడ్ యూనియన్లు అన్నీ చేతులు కలపాలి. ఈ కొత్త 'కార్మిక కోడ్'లను ఉపసంహరించుకునేలా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలి.

'లేబర్ కోడ్'లు, తక్కువ వేతనాలు మొదలైన వాటికి వ్యతిరేకంగా జూలై 9 సమ్మె 25 కోట్ల మంది కార్మికులను ఏకం చేసింది. దేశంలోని రైతులు ఏకమై ఢిల్లీ సరిహద్దుల్లో తమ పోరాటాన్ని కొనసాగించారు. తమ సుదీర్ఘ పోరాటంతో మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునేలా మోడీ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేశారు. సరుకు రవాణా ట్రక్కుల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు ఏకమై తమపై విధించిన కొత్త నిబంధనలను వెనక్కి తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. అదే స్ఫూర్తితో, ఇప్పుడు దేశ కార్మికులందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

1900వ దశకంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్‌ను బ్రిటిష్ ప్రభుత్వం బహిష్కరించింది. అప్పుడు, ముంబై (అప్పటి బొంబాయి) కార్మికులు అంతటి బలమైన నిరసన తెలిపారు. వారు ఎనిమిది రోజుల పాటు నగరాన్ని స్తంభింపజేశారు. కార్మికులు, శ్రామికులు కులం, మతం వంటి మతతత్వ రాజకీయాలను, విభజన శక్తులను నిరంతరం అధిగమిస్తూ ఐక్యంగా నిలబడ్డారు. తమ హక్కుల కోసం పోరాడి విజయం సాధించారు. మోడీ ప్రభుత్వ పెట్టుబడిదారీ బంధుప్రీతి విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే సమయం మరోసారి ముందుకొచ్చింది.

**(రచయిత ట్రేడయూనియన్ రంగంలో ఐదు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. పలు పారిశ్రామిక ట్రిబ్యునళ్లు, లేబర్ కోర్టుల్లో కార్మికుల పక్షాన ప్రాతినిధ్యం వహించారు.)**

**(ఫిబ్రవరి 2026మార్క్సిస్టు మాస పత్రిక నుండి)**

**(అనువాదం: సిద్ధయ్య)**

# డెక్కన్ క్రానికల్ ఎంప్లాయిస్ విజయం

## తప్పుగా లెక్కించిన పీఎఫ్ బకాయిలు రూ 6 కోట్లు చెల్లించక తప్పదు

## తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

డెక్కన్ క్రానికల్ ఉద్యోగులకు సానుకూలంగా తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈపీఎఫ్ (ఉద్యోగుల భవిష్య నిధి) బకాయిలపై దాఖలైన అప్పీల్‌ను త్వరగా పరిష్కరించాలని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ ను కోర్టు ఆదేశించింది. అయితే ఈ కేసు విచారణకు స్వీకరించాలంటే 30 శాతం ముందుగా జమ చేయాలన్న సీజీఐటీ (కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక ట్రిబ్యునల్) ఆదేశాన్ని హైకోర్టు సవరించింది.

డెక్కన్ క్రానికల్ ఉద్యోగులకు చెల్లించే ఈపీఎఫ్ మొత్తాన్ని తప్పుగా లెక్కించి తక్కువగా చెల్లించిన బకాయిలను వెంటనే చెల్లించాలంటూ పీఎఫ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలను డీసీ యాజమాన్యం సవాల్ చేస్తూ సంస్థ సీజీఐటీని ఆశ్రయించింది. అయితే, అప్పీల్‌ను వినేందుకు ముందు 30 శాతం ప్రీ–డిపాజిట్ తప్పనిసరి అని ట్రిబ్యునల్ ఆదేశించింది.

దీనిపై హైకోర్టును ఆశ్రయించిన డెక్కన్ క్రానికల్, ఈపీఎఫ్ చట్టంలో ఇంత అధిక ప్రీ–డిపాజిట్‌కు ఎలాంటి స్పష్టమైన నిబంధన లేదని వాదించింది.

వాదనలు, చట్టపరమైన నిబంధనలను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తిక్, ట్రిబ్యునల్‌కు షరతులు విధించే అధికారం ఉందని స్పష్టం చేస్తూ, సంస్థ ప్రస్తుత పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని 30 కాకుండా 20 శాతానికి మినహాయింపు ఇస్తున్నట్టు ఆదేశించారు.

అలాగే ట్రిబ్యునల్ ఆదేశంలో హైకోర్టు జోక్యం చేసుకుని, సవరించిన షరతుల మేరకు సీజీఐటీ ముందు అప్పీల్ కొనసాగించి త్వరగా పరిష్కరించాలని ట్రిబ్యునల్‌ను హైకోర్టు ఆదేశించింది.

దీంతో పీఎఫ్ ఆదేశాల మేరకు డెక్కన్ క్రానికల్, ఆంధ్రభూమి ఉద్యోగులకు 2017 ఏప్రిల్ నుంచి 2019 అక్టోబర్ వరకు తక్కువగా లెక్కకట్టిన రూ .5,93,06,774 మొత్తాన్ని చెల్లించక తప్పదు. దీంతో 2017 ఏప్రిల్ నుంచి ఇవీ వర్తించనుండటంతో సర్వీస్‌లో ఉన్నవారికి 5 నుంచి 6 లక్షల వరకు, రిటైర్డు అయిన ఆంధ్రభూమి, డెక్కన్ క్రానికల్ ఉద్యోగులకు (2017 ఏప్రిల్ తర్వాత) ఒక్కొక్కరికి లక్షన్నర నుంచి 2 లక్షల వరకు వారి పీఎఫ్ ఖాతాలలో జమ కావాల్సి ఉంది. అయితే ఇది ట్రిబ్యునల్ ఇచ్చే తుది తీర్పుపై ఆధారపడి ఉంటుంది.



ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఉపాధ్యక్షులు రేపటి రామాంజనేయులు ద్వారా అనంతపురం ప్రెస్ క్లబ్ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న సీనియర్ పాత్రికేయులు

## ఉత్తరప్రదేశ్‌లో జర్నలిస్టు అరెస్టు

మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక జర్నలిస్టును ఉత్తరప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పై అభ్యంతరకరమైన చిత్రాన్ని పోస్ట్ చేశారంటూ జర్నలిస్టు పవన్ తివారిని అరెస్టు చేశారు. బిజెపి హనుమాన్ గంజ్ మండల్ ప్రధాన కార్యదర్శి అమ్రేష్ కుమార్ పాండే దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ఆయనపై బి.ఎన్.ఎస్ సెక్షన్ 196(1) బి (మతం జాతి స్థలం ఆధారంగా వివిధ సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించటం) కింద కేసు నమోదు చేసినట్లు సీనియర్ అధికారులు తెలిపారు, పవన్ తివారి ఫేస్‌బుక్‌లో యూపీ ముఖ్యమంత్రి అభ్యంతరకరమైన చిత్రాన్ని పోస్ట్ చేశాడని వివాదాస్పద వ్యాఖ్య కూడా ఉందని అన్నారు.

# జర్నలిస్టులకు అన్ని విధాలా అండ

**పోలవరం ఎమ్మెల్యే శ్రీ బాలరాజు**




కూటమి ప్రభుత్వం మీడియాకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నదని పోలవరం నియోజకవర్గంలో మీడియాకు తోడ్పాటు నివ్వాలని ఆదేశాలున్నాయని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పష్టంచేశారు. తన నియోజకవర్గంలో ప్రతి జర్నలిస్టుకు బీమా సౌకర్యం కల్పిస్తామని, అలాగే ఇంటి నిర్మాణం కోసం స్థలం కూడా మంజూరు చేయాలనే ఆలోచనతో వున్నామని పేర్కొన్నారు.

జీలుగుమిల్లిలో ఫిబ్రవరి 10న ఏపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జర్నలిస్టులు అంటే తనకు మొదటి నుంచీ ఎంతో అభిమానం అని గతంలో వారిని రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్‌లు కూడా ఇచ్చామని గుర్తు చేశారు. మీడియాలో కొందరు ఇబ్బంది కరమైన వారున్నారని సోషల్ మీడియా పేరుతో అసంబద్ధ వార్తలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరిక చేశారు. అసెంబ్లీ సమావేశాలతరువాత నియోజకవర్గం లోని అన్ని మండలాల వారికీ స్థలం ఇస్తా మని పేర్కొన్నారు. విలేకరులలో కూడా మధ్య తర్గతి వారు వున్నారని అటువంటి వారికీ న్యాయం చేయాలని అన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర జనసేన కార్యదర్శి గడ్డ మణుగు రవి కుమార్, శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు సానుభూతితో పరిష్కారం చేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు ప్రసంగిస్తూ కోరారు. జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి చట్టసభలో కూర్చున్న పెద్దలు పట్టించుకుని పరిష్కరించాలన్నారు. జీలుగు మిల్లి పాత్రికేయులకు అన్ని విధాలా అండగా ఉంటామన్న ఎమ్మెల్యేకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

శాసన సభ్యుడు బాలరాజు జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లి వాటి పరిష్కారానికి ప్రయత్నించాలని అభ్యర్ధించారు.

కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా కొప్పుల సాయి, కార్యదర్శిగా బుట్టాయి గూడెం కు చెందిన మధు, కోశాధికారిగా చిట్టీ బొమ్మ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా లక్షణ రావులు ఎన్నికయ్యారు.

**అక్రిడిటేషన్ సభ్యులకు ఆత్మీయ సత్కారం**

సమావేశంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కె ఎస్ శంకరరావు, పి కళ్యాణ్ బాబులను నియోజకవర్గం అధ్యక్షులుగా కొప్పుల సాయి, కార్యదర్శి మధు తదితర జీలుగుమిల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు సత్కరించారు.ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్షులు ఎస్ డి జబీర్, కార్యదర్శి హరీష్ బి సి ఎన్ ఛానల్ అధినేత షకిల్ బాబ్జి, మంజీర గళం అధినేత శేఖర్,సీనియర్ జర్నలిస్టు ఎన్.వి. అప్పారావుతో పాటు పలువురిని సన్మానించ్చారు. కార్యక్రమంలో బొంతు రామకృష్ణ, కడిమి సాయి, కొల్లం రవికుమార్, కంచర్ల సుబ్రహ్మణ్యం, జాల వంశి, బట్టు సందీప్, మారుమూడి జయంత్, కూరాకుల రామాంజనేయులు, గాడిచర్ల శ్రీనివాస్, మరిదు మంగరాజు, మేకల మంగరాజు, జాన్ మోసెస్, ఒరిగేటి బెంజ్, ఒబిలి శెట్టి రవితేజ, చిత్తపుడి పవన్ కుమార్, కొప్పుల రాము తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.





# అనకాపల్లి ఏపీబీజేఈ నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్స అసోసియేషన్ (ఏపీబీజేఏ) అనకాపల్లి నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కశింకోటలో ఫిబ్రవరి 4న ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షులు షేక్ ఛాంద్ బాషా ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై నిరంతరాయంగా పోరాడుతున్నది ఒక ఫెడరేషన్ మాత్రమే అన్నారు. యూనియన్ చేపడుతున్న కార్యక్రమాలు చూసి ప్రతి ఏటా సభ్యుల సంఖ్య పెరుగుతూ వస్తుందని అన్నారు. సుమారు 20 ఏళ్లుగా అనకావల్లిలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై ఫెడరేషన్, ఎపిబిజెఎ పోరాడుతుందని అన్నారు. అనంతరం అక్రిడేషన్ కమిటీ సభ్యులైన బి. ఈశ్వరరావు, బి. కొండలరావు, పీలా నాగను సన్మానించారు. అలాగే ఏపీబీజేఏ నూతన కార్యవర్గంను అంతా అభినందించారు.

**నూతన కార్యవర్గం**

అనకాపల్లి ఏపీబీజేఏ అధ్యక్షులుగా పైలా రామారావు, కార్యదర్శిగా కోరిబిల్లి గణేష్, ఉపాధ్యక్షులుగా జూమ్ శేఖర్, జాయింట్ సెక్రటరీగా పూసర్ల రాజా, కోశాధికారిగా బి. గంగాధర్, కార్యవర్గసభ్యులుగా షణ్ముక్, కుమార్, హనుమంతరావు, యడ్ల రామకృష్ణ ఎన్నికయ్యారు.

# డిడి సదాశివరావు సేవలు ప్రశంసనీయం

విశాఖ జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న సదాశివరావు సేవలు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు.. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ( ఎన్ఏజే)లు కొనియాడారు. ఫిబ్రవరి 14న విశాఖపట్నంలోని డిపిఆర్ఓ కార్యాలయంలో సదాశివరావును పలువురు వర్కింగ్ జర్నలిస్టులతో కలిసి ఫెడరేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లాలో ఇప్పటికే జారీ చేసిన అక్రిడేషన్లు, అలాగే ప్రస్తుతం జిల్లా అధికార యంత్రాంగం ద్వారా నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో సహకరించాలని డిడిని ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా డిడి సదాశివరావు మాట్లాడుతూ తాను ఇప్పటికే ఎన్నో జిల్లాల్లో పనిచేయడం జరిగిందని అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. జిల్లాలో జర్నలిస్టులు సహకారం కూడా బాగుందని డిడి సదాశివరావు అన్నారు. ఈ సందర్భంగా డిడి సదాశివరావును ఫెడరేషన్ నాయకులు సత్కరించారు.. కార్యక్రమంలో ఏపీఆర్ఓ కిషోర్, ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ్, కార్యదర్శి జి. శ్రీనివాస రావు, డిప్యూటీ కార్యదర్శి ఏ. సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి ఖాదర్, ఏపీబీజేఏ అధ్యక్షులు భాషా, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఇ. ఈశ్వరరావు, కార్యదర్శి కె. మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



## దూరదర్శన్ యాంకర్ సరళ కన్నుమూత



దూరదర్శన్‌లో పనిచేసిన ప్రముఖ న్యూస్ యాంకర్ సరళ మహేశ్వరి (71) న్యూఢిల్లీలో కన్నుమూశారు. 1970-80 దశకంలో దూరదర్శన్ లోని ప్రముఖ న్యూస్ రీడర్లలో ఆమె ఒకరు. 1976లో పిహెచ్‌డి చేస్తున్న సమయంలో ఆమె దూరదర్శన్‌లో ఉద్యోగంలో చేరారు. భారత టెలివిజన్ చరిత్రలో ప్రత్యక్ష ప్రసార వార్తలు చదివి చదివిన మొదటి కొద్దిమంది న్యూస్ రీడర్లలో ఆమె ఒకరు. 1986-88 వరకు ఆమె యూకేలో బిబిసి న్యూస్ రీడర్‌గా పనిచేసి మళ్లీ తిరిగి దూరదర్శన్‌లో చేరారు. ఆమె మృతికి దూరదర్శన్ నివాళులర్పించింది. ఆమెది మృదువైన స్వరం, ఖచ్చితమైన ఉచ్చారణ అని ప్రశంసించింది.

## ప్రజాశక్తి విలేకరి శ్రీనివాసులు మృతి



సీనియర్ జర్నలిస్ట్, ప్రజాశక్తి విలేకరి, నంద్యాల జిల్లా అక్రిడిటేషన్ సభ్యులు మాదాల శ్రీనివాసులు(62) ఫిబ్రవరి 16న మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు. విద్యార్థి దశ నుంచి వామపక్ష భావాలతో చురుకైన పాత్ర పోషించిన శ్రీనివాసులు 1992లో ప్రజాశక్తి విలేకరిగా జర్నలిస్టు వృత్తిని ఎంచుకున్నారు. ఆయనకు గుండెపోటు రావడంతో జనవరి 29న ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యచికిత్సకు శరీరం స్పందించకపోవడంతో ఫిబ్రవరి 14న నంద్యాలకు తీసుకువచ్చారు. ఫిబ్రవరి 16వ తేదీ శ్రీనివాసులు చనిపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్మాణం కోసం శ్రమించిన మాదాల శ్రీనివాసులు మృతి జర్నలిస్ట్ ఉద్యమానికి తీరని లోటు. ఆయన మృతికి నంద్యాల జిల్లా ఫెడరేషన్ కన్వీనర్ జి.మద్దయ్య ప్రగాఢ సంతాపం తెలియజేసి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## సీనియర్ జర్నలిస్టు గూడపాటి మృతి



సీనియర్ జర్నలిస్టు, గుడివాడకు చెందిన గూడపాటి సువిశ్వేశ్వరరావు అకాల మరణం పాలయ్యారు. విశాలాంధ్ర దినపత్రికలో సుదీర్ఘకాలం ఆయన పనిచేశారు. జర్నలిస్టు ఉద్యమంలో జిల్లాలో ముఖ్యపాత్ర పోషించారు. ఆయన కుమారులు ఇద్దరు జర్నలిస్టులుగా పనిచేస్తున్నారు. సువిశ్వేశ్వరరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కృష్ణాజిల్లా శాఖ కార్యదర్శి వై.శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో విలేకరి మృతి



అవుకు పట్టణానికి చెందిన ఆంధ్రభూమి దినపత్రిక విలేకరిగా పనిచేసిన బండి సత్యం (52) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన ఇరవై సంవత్సరాలు ఆంధ్రభూమి దినపత్రిక విలేకరిగా పనిచేశారు. అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బండి సత్యం మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.గోరంట్లప్ప ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.


ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్
(APWJF - APBJA)
అనకాపల్లి జిల్లా


APWJF
APBJA
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్
డా॥ బి.ఆర్. అంబేద్కర్
కోనసీమ జిల్లా




ఐక్యత
పోరాటం
APWJF
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్
కృష్ణా జిల్లా కమిటి
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్
ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్
APWJF
ఎన్టీఆర్ జిల్లా కమిటీలు
APBJA


జర్నలిస్టుల సమస్యలపై
APWJF
APBJA
చలో విజయవాడ
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్
అనంతపురం & శ్రీ సత్యసాయి జిల్లాలు
ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (APBJA)


ఐక్యత
పోరాటం
APWJF
APWJF
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్
కృష్ణా జిల్లా కమిటి


APWJF - APBJA
APWJF
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్
ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్
కాకినాడ జిల్లా కమిటీ


ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్
(APWJF - APBJA)
నంద్యాల జిల్లా.




APWJF
ప్రశ్నించు.. పోరాడు..
APBJA
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (APWJF)
ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (APBJA)
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కమిటీ


జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని
జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి
మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి
జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి
జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి
మార్చి 4 న
చలో విజయవాడ
జర్నలిస్టులపై దాడులు నివారించాలి
ఆరోగ్య బీమాను పూర్తిస్థాయిలో అమలు చేయాలి
కార్మిక బీమా సదుపాయం కల్పించాలి
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్
APWJF APBJA
APWJF
APWJF - APBJA

APWJF
APBJA

PDSO